# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక :156 | ప్రచురుణ : హైదరాబాద్ | శనివారం,18-04-2026 | పేజీలు: 8 | వెల : 3- 00


## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్

# బిల్లులకు బ్రేక్...

### లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

- రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు
- బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండొంతుల మెజార్టీ రాకపోవడంతో వీగిపోయిన బిల్లు



కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి లోక్‌సభలో ఊహించని, భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు శుక్రవారం సభలో వీగిపోయింది. లోక్‌సభ స్థానాలను పెంచడంతో పాటు, చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన ఈ బిల్లు, అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించడంలో విఫలమైంది. రెండు రోజుల పాటు జరిగిన వాడీవేడి చర్చ అనంతరం జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. సాధారణ మెజారిటీ లభించినప్పటికీ, రాజ్యాంగ సవరణకు తప్పనిసరి అయిన ప్రత్యేక మెజారిటీని పొందలేకపోవడంతో బిల్లు ఓటమి పాలైంది. ఈ బిల్లు ద్వారా లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలను 850కి పెంచాలని, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేశాక ఈ పెంపును అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనితో పాటే, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 33 శాతం మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

బిల్లుపై జరిగిన చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా బలంగా తమ వాదనలు వినిపించారు. ఓటర్లు, ప్రజాప్రతినిధుల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమానతను సరిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొంది. మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రతిపక్షాల వైఖరిని దేశంలోని మహిళలందరూ గమనిస్తున్నారని హెచ్చరించారు. నియోజకవర్గాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అడ్డుకుంటూ వస్తోందని, ఇప్పుడు కూడా అదే పనిచేస్తోందని అమిత్ షా ఆరోపించారు.అయితే, ప్రభుత్వ వాదనను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. మహిళా సాధికారత అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయ ఎత్తుగడకు పాల్పడుతోందని విమర్శించాయి. ఈ బిల్లు ఆమోదం పొందితే, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తర భారత రాష్ట్రాలకు రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుందని, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. దక్షిణాది రాష్ట్రాల గొంతును అణచివేసే ప్రయత్నమే ఈ బిల్లు అని విపక్షాలు ఆరోపించాయి.ఈ కీలక బిల్లు ఓటమి పాలవడంతో, దీనితో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మహిళా

కోటాను విస్తరించే సవరణ బిల్లులను కూడా ముందుకు తీసుకువెళ్లబోమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఈ ఓటమి మోదీ ప్రభుత్వ శాసనపరమైన రికార్డులో ఒక అరుదైన వైఫల్యంగా నిలిచిపోతుంది. అదే సమయంలో, తమ వాదనకు విజయం లభించిందని ప్రతిపక్షాలు భావిస్తున్నప్పటికీ, చట్టసభల్లో అడుగుపెట్టాలని ఆశిస్తున్న మహిళలకు మాత్రం రిజర్వేషన్ల కోసం నిరీక్షణ మరింత పెరిగింది. ఈ పరిణామంతో మహిళా రిజర్వేషన్ల భవిష్యత్తు మళ్లీ అనిశ్చితిలో పడింది.

## కేటీఆర్ ను టార్గెట్ చేస్తూ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేసిన కవిత

- పదేళ్లుగా కేటీఆర్ ప్రజల్లోకి ఎందుకు వెళ్లలేదన్న కవిత
- ఇప్పుడు పాదయాత్ర చేస్తానంటే ఎవరు నమ్ముతారని ఎద్దేవా
- అందరికీ అధికారం కావాలని తాను అన్న తర్వాతే కష్టాలు మొదలయ్యాయని వెల్లడి



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు కేటీఆర్ పై విమర్శల దాడిని ఉద్ధృతం చేశారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో పలు సామాజిక సంఘాల నేతలతో భేటీ అయిన ఆమె, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై రాజీకయంగా అత్యంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ ఎందుకు ప్రజల్లోకి పోలేదు? ఇప్పుడు పాదయాత్రలు చేస్తానంటే ఎవరు నమ్ముతారు?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. కేటీఆర్ పాదయాత్ర ప్రస్తావనను ఎద్దేవా చేస్తూ, అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను పట్టించుకోని వారు ఇప్పుడు ప్రజల్లోకి వెళ్లడం వెనుక అర్థమేంటని నిలదీశారు. సామాజిక తెలంగాణే లక్ష్యంగా తాను కొత్త రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టానని, అందుకే తనకు అనేక కష్టాలు వచ్చాయని కవిత పేర్కొన్నారు. "అందరికీ అధికారం అందాలని నేను మాట్లాడటం మొదలుపెట్టాకే నాకు సమస్యలు ఎదురయ్యాయి. బీఆర్ఎస్ నన్ను సస్పెండ్ చేసినా, సామాజిక తెలంగాణ సాధించే వరకు నా పోరాటం ఆగదు" అని ఆమె స్పష్టం చేశారు. తన కొత్త పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ వంటి బహుజన సంఘాలు మద్దతు తెలపడం తనకు కొండంత బలాన్ని ఇస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. వీరన్న అనుచరులు తనతో కలవడమంటే ఇక తమను ఆపే శక్తే లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని, సమయం వచ్చినప్పుడు వారి పేర్లు బయటపెడతానని బాంబు పేల్చారు. గ్రహగతులు అనుకూలించాలని, ఏదైనా శని అడ్డు ఉంటే తొలగిపోవాలని వారణాసిలో పూజలు చేసినట్లు కూడా ఆమె వెల్లడించారు.

## 'పాత మిత్రుల కలయిక': ఢిల్లీలో టీడీపీ మిత్రులను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి



ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో తాను కలిసి పనిచేసిన పాత మిత్రులను కలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రలను పార్లమెంట్ లాబీలో కలిసి కాసేపు ముచ్చటించారు.ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు. వీరు నలుగురు గతంలో తెలుగుదేశం పార్టీలో పనిచేశారు. రాష్ట్ర విభజన తదనంతర పరిణామాల నేపథ్యంలో, రేవంత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు.రేవంత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డిలతో సమావేశమైనట్లు పయ్యావుల కేశవ్ 'ఎక్స్' వేదికగా 'పాత మిత్రుల కలయిక' అంటూ పోస్టు పెట్టారు. రేవంత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశామని పేర్కొన్నారు.



## ధాన్యం సేకరణ కోసం కేంద్రమంత్రిని

# కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

### కేంద్రమంత్రి జోషితో రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ
### 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని విజ్ఞప్తి
### రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ

కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. వానాకాలం యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని వారు కేంద్రమంత్రిని కోరారు. 2025-26 సీజన్ కు గాను యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ధాన్యం సేకరణ,

కేంద్ర ప్రభుత్వం వాటా సంబంధిత అంశాలపై కేంద్రమంత్రితో వారు చర్చించారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని వారు కోరారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

### మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు
### కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీ
### మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తి చేయాలన్న ప్రభుత్వం



బీఆర్ఎస్ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు, శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీని వేసింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తి చేయాలని కమిటీని ఆదేశించింది.

కల్నల్ పరీక్షిత్ మెహ్రా నీటిపారుదల, టన్నెలింగ్ నిపుణులు. మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను సమన్వయం చేయడం, నిర్ణీత కాల వ్యవధిలో ప్రాజెక్టును తిరిగి వినియోగంలోకి తీసుకురావడంపై కమిటీ పనిచేయనుంది. వారానికి రెండుసార్లు సమావేశమై పురోగతిని సమీక్షిస్తుంది. ప్రతిరోజు జరిగే పనులపై రోజువారీ పురోగతి నివేదికలను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.వర్షాకాలం ప్రారంభానికి ముందే కీలకమైన పరీక్షలను పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. బ్యారేజీల పునాదుల పటిష్ఠతను తెలుసుకోవడానికి మే 30వ తేదీ లోపు జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశించారు. సెంట్రల్ వాటర్ కమిషన్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలు, అనుమతుల మేరకు మాత్రమే ఈ మరమ్మతులు సాగనున్నాయి. ముందుగా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, మేడిగడ్డను పాక్షికంగానైనా వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

# మహిళా రిజర్వేషన్‌పై మజ్లిస్ కుట్ర?



రేవంత్ రెడ్డి ఇచ్చిన హైబ్రిడ్ ఫార్ములా మజ్లిస్ పార్టీ తయారు చేసిందని కేంద్ర మంత్రి కిషన్?రెడ్డి విరుచుకపడ్డారు. అసదుద్దీన్ పార్లమెంట్ లో రేవంత్ రెడ్డి ఫార్ములాను ప్రశంసించాడని మండిపడ్డారు. శుక్రవారం ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. మొదటి నుంచి మహిళలకు ఎటువంటి రిజర్వేషన్లు ఉండొద్దనేది మజ్లిస్ పార్టీ కుట్ర చేస్తుందని, మహిళలు రాజకీయాల్లోకి వస్తే కొత్త సమస్యలు వస్తాయని మజ్లిస్ నాయకులు, అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడినవి అసెంబ్లీ రికార్డులో ఉన్నాయని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో సీట్ల పునర్విభజన జరిగితే తమ సీట్లకు ఎక్కడ ముప్పువస్తుందో అనే భయంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీని కలిపి కుట్రలు చేస్తోందన్నారు. మజ్లిస్ పార్టీ ఈ రెండు పార్టీలతో కలిసి చర్చించి పునర్విభజనను, మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకంగా ప్రచారం చేస్తోందన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి 70 శాతం ఆదాయం వస్తుంది. మిగిలిన జిల్లాలకు కోతపెట్టి గ్రేటర్ ?జిల్లాలో సీట్లు పెంచాలని రేవంత్, అసదుద్దీన్, కేటీఆర్ కోరుతున్నారని, మిగిలిన జిల్లాల్లో సీట్లు పెరగాల్సిన

# మహిళా రిజర్వేషన్‌పై మజ్లిస్ కుట్ర?

- మొదటి పేజీ తరువాయి

అవసరం లేదో ఈ ముగ్గురు సమాధానం చెప్పాలని డిమాండ్? చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో అనేక రోజులుగా వివిధ రాజకీయ పార్టీలు, విద్యావంతులు, మేధావులతో చర్చలు జరిపి మహిళా రిజర్వేషన్ బిల్లుకు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలను తెరపైకి తీసుకొచ్చిందని అన్నారు.

**దక్షిణాదికి, ఉత్తరాదికి యుద్ధం అనడం విడ్డూరం :**

దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని, దక్షిణాదికి, ఉత్తరాదికి యుద్ధం వస్తుందని పార్లమెంటు వేదికగా మాట్లాడటం విడ్డూరంగా ఉందని కిషన్ రెడ్డి అన్నారు. మొదట్లో జనాభా సేకరణ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం దక్షిణాదిలో సీట్లు తగ్గకుండా ప్రజల సెంటిమెంటును గుర్తించి 50 శాతం పెంపు ఫార్ములా తీసుకుని వచ్చిందన్నారు. ఏ కారణంతో వ్యతిరేకించాలో తెలియకుండా గుడ్డిగా కొత్త ఫార్ములాను వ్యతిరేకిస్తున్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తే నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దేశంలోని అన్ని ప్రాంతాల్లో మహిళలతో సహా పురుషుల్లోనూ కొత్త నాయకత్వం వస్తుందనే భయం విపక్షాల్లో ఉంది. అదే జరిగితే తరతరాలుగా కుటుంబాల చేతుల్లో ఉన్న పార్టీల నాయకులకు వారి ప్రాబల్యం తగ్గుతుందనే భయం నెలకొంది. బడుగు బలహీన వర్గాలకు అధికారం దక్కొద్దనే భయంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ, ఇతర రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నాయని మండిపడ్డారు. రిజర్వేషన్ మహిళలకు వస్తుందేమోనన్న కుట్రతో మజ్లిస్ ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోంది. దానికి సీఎం రేవంత్, కేటీఆర్ వంతపాడుతున్నారు. మత ఛాందసవాదంతో మజ్లిస్ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్ లను ఏకం చేస్తోందని ఆరోపించారు.జీహెచ్ఎంసీలో ఏ ఒక్క ముస్లిం మహిళా కార్పొరేటర్ పేరు ఎవరైనా చెప్పాలని ప్రశ్నించారు. మహిళలు వంటింటి కుందేలుగా, పిల్లలు కనే మిషన్లుగా మాత్రమే ఉండాలనేది మజ్లిస్ ఆలోచన అన్నారు. మోడీ ఫార్ములాతో దక్షిణాదికి న్యాయమా, అన్యాయమా అని బహిరంగంగా చర్చించేందుకు సవాల్ విసిరారు. వితండవాదం లేకుండా చర్చకు రావాలన్నారు. ఏపీ విభజన బిల్లులో తెలంగాణలో అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153 స్థానాలకు, ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ స్థానాలను 175 నుంచి 225కు పెంచాలని పేర్కొన్నారు. ఏ ఫార్ములా అనుసరించారో కాంగ్రెస్ నాయకులు, సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. బిల్లు పాసైన తర్వాత ఇందులో అమెండ్‌మెంట్ చేయాలంటే నోటిఫై చేయాల్సిందే. 2023లో తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర న్యాయశాఖ నోటిఫై చేసింది. ఇప్పుడు మహిళా బిల్లులో సవరణలు తీసుకొచ్చేందుకు వీలవుతుందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తున్న వారంతా చరిత్రహీనులుగా మిగిలిపోక తప్పదన్నారు.

## సత్తుపల్లి రింగ్ సెంటర్లో ఎల్ఈడీ డిస్ ప్లే స్క్రీన్ ఏర్పాటు

**సత్తుపల్లి, ఏప్రిల్ 17** , సత్తుపల్లి రింగ్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ డిస్ ప్లే స్క్రీన్ ను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ రాత్రి పరిశీలించారు. స్క్రీన్ పై ప్రదర్శితమవుతున్న ప్రకటనలను ఆమె వీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెహానా కమలపాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలతతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి



**సత్తుపల్లి, ఏప్రిల్ 17** రాత్రి మణుగూరు సిఎస్పి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని విఠల్రావు నగర్కు చెందిన రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇంటి ముందు క్షుద్ర పూజల కలకలం

**వర్ధన్నపేట, ఏప్రిల్ 17** పర్వతగిరి మండల కేంద్రంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. అల్లూరి కాలనీకి చెందిన రవీందర్ అనే వ్యక్తి ఇంటి ఎదుట నిమ్మకాయలు, కొబ్బరికాయలు, పూజా సామగ్రితో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు లభించాయి. రవీందర్ కుటుంబంతో సహా హైదరాబాదులో నివసిస్తున్నాడు. ఈ సంఘటనతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు.

## “మన పత్తిపాక గుట్టలను కాపాడుకుందాం”

**పరకాల, ఏప్రిల్ 17** హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామ ప్రజలు, ప్రకృతి సంపదను కొల్లగొడుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్న స్టోన్ క్రషర్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యుల నేతృత్వంలో “మన పత్తిపాక గుట్టలను కాపాడుకుందాం” అనే నినాదంతో ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్, డాంబర్ ప్లాంట్ వల్ల ఇప్పటికే ఒక గుట్ట పూర్తిగా కనుమరుగైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

## గంజాయి మత్తులో హమాలి పై దాడి

**నర్సంపేట, ఏప్రిల్ 17** వరంగల్ నగరంలోని లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ సమీపంలో గంజాయి మత్తులో ఉన్న నలుగురు వ్యక్తులు ఒక హమాలిపై దాడి చేశారు. మార్కెట్లో పనిచేస్తున్న సూరయ్య బహిర్భూమికి వెళుతుండగా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీస్ సమీపంలో నలుగురు వ్యక్తులు ఒకరిని కొడుతుండడాన్ని గమనించి, వారిని ఆపేందుకు వెళ్లారు. దీంతో, దాడి చేస్తున్న వ్యక్తులు సూరయ్యను కూడా కొట్టారు. అక్కడే ఉన్న రైతులు సూరయ్యను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.


## కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

**వరంగల్ ఈస్ట్, ఏప్రిల్ 17** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో నేషనల్ హైవే 365ః పై వీరన్నపేట స్టేజి వద్ద అతివేగంగా రాంగ్ రూట్లో వచ్చిన కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో తొడెంగుల నర్సింహులు అనే వ్యక్తి శుక్రవారం అక్కడికక్కడే మృతి చెందారు. నర్సింహులు తన ఆకుకూరల వ్యాపార నిమిత్తం జనగామ జిల్లాలోని విఎస్ఆర్ నగర్, కట్కూర్ ప్రాంతాలకు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. జనగామ నుండి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు (ఖ15ఒ2525) అతివేగంతో రాంగ్ రూట్లో వచ్చి, నర్సింహులు నడుపుతున్న టివిఎస్ లూనా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది.

## జనగామ జిల్లాలో ఘోర ప్రమాదం

**వరంగల్ వెస్ట్, ఏప్రిల్ 17** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం అలిపురం వద్ద శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో వడ్ల లోడుతో వెళ్తున్న లారీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో లారీ ఇంజిన్ భాగం పూర్తిగా కాలి బూడిదైంది. అప్రమత్తమైన డ్రైవర్ నిడుగొండ నాగరాజు (36) లారీ నుంచి దూకి తన ప్రాణాలను కాపాడుకున్నారు. ఖమ్మం నుండి కామారెడ్డికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## నర్సంపేటలో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక సమీక్ష



**ములుగు, ఏప్రిల్ 17** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేట రైతు వేదికలో ఆర్డీఓ ఉమారాణి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కార్యక్రమాన్ని మరింత విస్తరించి ప్రజల్లో అవగాహన పెంచాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఎంఆర్డీ, ఎంఈఓ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలపై నిరసనకు భారీ స్పందన




శుక్రవారంనాడు కూసుమంచి మండలంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రాష్ట్ర TGEJAC ఇచ్చిన దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా, కూసుమంచి మండల TGEJAC ఆధ్వర్యంలో ఈరోజు (17-04-2026, శుక్రవారం) మధ్యాహ్న భోజన విరామ సమయంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ గారికి పలు ప్రధాన డిమాండ్లతో మెమోరాండం సమర్పించారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. రెండవ పిఆర్సి కమిషన్ రిపోర్ట్‌ను వెంటనే విడుదల చేసి అమలు చేయాలి.
2. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 13,000 కోట్ల బిల్లులను తక్షణమే విడుదల చేసి, పెన్షనర్లకు మరియు ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించాలి.
3. ఉద్యోగులు, పెన్షనర్లందరికీ ఆరోగ్య కార్డులను వెంటనే మంజూరు చేసి, కొత్త జుూా పథకాన్ని మే 1వ తేదీ నుండి అమలు చేయాలి. 4. రాష్ట్రంలో కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ (CPS)ను రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్ (OPS)ను పునరుద్ధరించాలి. అలాగే 01-09-2004కు ముందు నోటిఫికేషన్ పొందిన ఉద్యోగులకు OPS అమలు చేయాలి. ఇవి కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 64 ప్రధాన సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో TGE JAC ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హైడ్రా ...డ్రామా...




**హైదరాబాద్, ఏప్రిల్ 17,**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక సంస్థ హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. గత కొద్ది రోజులుగా నగరవ్యాప్తంగా అక్రమ నిర్మాణాల తొలగింపులో దూకుడు ప్రదర్శిస్తున్న హైడ్రాకు ఇది బిగ్ షాక్ అని వైరల్ అవుతోంది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కూల్చివేతలు నిలిపివేయాలనే హైకోర్టు స్పష్టం చేసినట్టు ప్రచారం సాగుతోంది. హైడ్రా పేరుతో జరుగుతున్న ప్రచారాన్ని హైడ్రా ఖండించింది. ఇదంతా తప్పుడు ప్రచారమని కొట్టిపారేసింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఆ నోటీసులు పూర్తిగా నకిలీవని స్పష్టం చేసింది. ఈ ఫేక్ ప్రచారంపై హైడ్రా తీవ్రంగా స్పందించింది. ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడింది. ఈ మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుకు అధికారికంగా ఫిర్యాదు కూడా చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని, న్యాయస్థానాల గౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైడ్రా కోరింది. హైడ్రా కార్యకలాపాలను పరిశీలించిన హైకోర్టు, ఈ సంస్థకు ఇప్పటి వరకు ఒక నిర్దిష్టమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకపోవడాన్ని తప్పుపట్టిందని సర్క్యులేట్ అవుతున్న డాక్యుమెంట్‌లో ఉంది. ఏడాది కాలం గడుస్తున్నా, నిబంధనలు రూపొందించకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిందని నోటీసుల్లో పేర్కొన్నట్టు ఉంది. నోటీసులు ఇవ్వకుండా ఇష్టానుసారంగా కూల్చివేతలు చేపట్టడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ కాదని కూడా కోర్టు అభిప్రాయపడినట్టు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా అమీన్‌పూర్ పరిలో జరిగిన కూల్చివేతలకు సంబంధించిన వీడియోను పరిశీలించిన తర్వాత న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసిందని కూడా అందులో ఉంది. అయితే ఇవన్నీ కూడా హైడ్రాను దెబ్బతీసేందుకు ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని అధికారులు మండిపడ్డారు. హైదరాబాద్‌లోని సహజ వనరులను కాపాడటానికి హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు తీరుపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చివేసేటప్పుడు కనీస గడువు ఇవ్వడం లేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పుడు కొందరి నుంచి వస్తున్న విమర్శలనే కోర్టు ఆదేశాలు అంటూ ప్రచారం చేస్తున్నారు. దీనిపై హైడ్రా ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు స్టార్ట్ చేశారు.

ఫాతిమా సంస్థల్లో చేరడంపై హైడ్రా కండిషన్స్

హైదరాబాద్ పాతబస్తీ బండ్లగూడలోని బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలంగాణ హైకోర్టు కీలక సూచన చేసింది. ఈ విద్యా సంస్థ నిర్మాణాల విషయమై పిటిషన్లు కోర్టులో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో విద్యార్థులు, వారి పేరెంట్స్ తమ సొంత రిస్క్‌పైనే అడ్మిషన్లు తీసుకోవాలని స్పష్టం చేసింది. విద్యాసంస్థకు వ్యతిరేకంగా తీర్పు వస్తే అప్పుడు ఎలాంటి హక్కులు కోరలేరని స్పష్టం చేసింది. కాబట్టి ఇప్పటికే అక్కడ చదువుతున్న విద్యార్థుల భవితవ్యం కూడా తుది తీర్పుకు లోబడే ఉంటుందని జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ కీలక ఆదేశాలు జారీ చేశారు.సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ విద్యా సంస్థను అక్రమంగా నిర్మించారని దీనిపై హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని అడ్వకేట్ విజయ్ గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ నగరంలో 26 చెరువులుండగా.. కేవలం సల్కం చెరువుకు మాత్రమే ఎఫ్‌టీఎల్ ఖరారు చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఏఐఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ స్థాపించిన 'సలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో ఈ సంస్థ నడుస్తోందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న శాటిలైట్ చిత్రాలను పరిశీలిస్తే.. ఈ సంస్థ చెరువు మధ్యలో, బఫర్ జోన్‌లో నిర్మించినట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.విద్యా సంస్థపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని మేనేజ్‌మెంట్ తమ నోటీసు బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. దాంతో పాటు సల్కం చెరువు పరిధిలో ఇకపై ఎలాంటి అదనపు నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 1 నుండి ప్రారంభం కానున్న కొత్త విద్యా సంవత్సరంపై కోర్టు ఇచ్చే తదుపరి ఉత్తర్వులు ప్రభావం చూపుతాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. అనంతరం తదుపరి విచారణను ఏప్రిల్ 30కి వాయిదా వేశారు.కాగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. ఒవైసీ ఫాతిమా కాలేజీ సల్కం చెరువులో నిర్మించినట్లు ఆధారాలు ఉన్నా.. దానిపై చర్యలు తీసుకోలేదు. ఇదే విషయమై సోషల్ మీడియా తదితర మాధ్యమల్లో హైడ్రాని పలువురు ప్రశ్నించారు. దీంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గతంలోనే క్లారిటీ ఇచ్చారు. సల్కం చెరువు ఎఫ్టీఎల్‌లో నిర్మించిన ఫాతిమా కాలేజ్ తొలగిస్తామని గత సెప్టెంబర్‌లో ప్రకటించామని చెప్పారు. అయితే పేద ముస్లిం మహిళల కోసం కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థ ఇక్కడ నడుస్తోందని అన్నారు. ఈ కాలేజీలో ఎలాంటి ఫీజులు వసూలు చేయరని.. 10 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పేదల కోసం పనిచేస్తున్న కాలేజీ అయినందునే సామాజిక కోణంలో ఆలోచించి చర్యలు తీసుకోలేకపోతున్నామని చెప్పారు.

## పిప్రిలో నూతన ఆరోగ్య కేంద్రం ప్రారంభం

**బాల్కొండ, ఏప్రిల్ 17** నిజామాబాద్ జిల్లా, బాల్కొండ మండలం పిప్రి (జె) గ్రామంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నూతన ఆరోగ్య కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ అరిగెల జనార్ధన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, బీపీ, షుగర్ వంటి వ్యాధులు నియంత్రణలో ఉంటేనే జీవితం ఆనందంగా సాగుతుందని, ఈసీజీ పరీక్షల ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. గ్రామ ప్రజలకు ఉచితంగా మాత్రలు పంపిణీతో పాటు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.



# బెడ్ సైడ్ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని ప్రగతి భవన్ లో వినతి పత్రం



**వరంగల్ సిటీ బ్యూరో. (న్యూస్ ఇండియా ప్రతినిధి (రవీందర్)**ప్రభుత్వ ఆస్పటల్ బెడ్ సైడ్ కాంటాక్ట్ కార్మికుల వేతనాలు పెంచుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించని ఎడల “” మహా ధర్నా”” :::::: ూ్రూ రాష్ట్ర అధ్యక్షులు కుర్రి. సైదయ్య.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పటల్ నందు శానిటేషన్ , పేషంట్ కేర్ , సెక్యూరిటీ , సూపర్వైజర్ గా డ్యూటీ చేస్తున్న కార్మికులకు ఏజెన్సీలుగా వివరిస్తున్న కాంట్రాక్టర్లు శ్రమ దోపిడీ చేస్తున్నారు

2022 న రాష్ట్రవ్యాప్తంగా వేతనములు ప్రతీ కార్మికుడికి లి15,600/- జీవోను రిలీజ్ చేసింది.

కానీ సదరు కాంట్రాక్టర్లు జిల్లాల వారీగా ఏరియాల వారీగా హాస్పిటల్ లో పనిచేస్తున్న కార్మికులకు మొత్తం నెల వేతనం 10,000/- �డ 11,000/- ఇస్తూ కార్మికుల పొట్ట కొడుతున్నారు అని ూ్రూ రాష్ట్ర అధ్యక్షులు కుర్రి. సైదయ్య అన్నారు

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా నిరుపేదలు అయినా శానిటేషన్, పేషెంట్ కేర్ , సెక్యూరిటీ, సూపర్వైజర్ ప్రభుత్వ ఆస్పటల్ నందు 17000 మంది కార్మికులుగా పనిచేస్తున్న మా యందు దయవుంచి ఈ కాంట్రాక్టు వ్యవస్థను తొలగించి ప్రతి కార్మికుడని ( ×ఖీవీ×ూ ) ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్మెంట్ ఇన్స్టిట్యూట్ సిస్టం ద్వారా కనీస వేతనం 26,000/- ఇవ్వాలి అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న. బోస్క. నరేష్. డిమాండ్ చేసినారు.

ఈ రోజు పలు అంశముల మీద ప్రజావాణి నందు ూ్రూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించడం జరుగుతుంది.

కార్మికుల యొక్క ప్రధాన డిమాండ్లు

1 ) కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

2 ) ×ఎఖీమీ నుండి ×ఖీవీ×ూ లోనికి విలియం చేయాలి

3 ) కనీస వేతనం 26,000/- అమలు చేయాలి

4 ) ప్రతి కార్మికునికి జీతం నేరుగా ప్రభుత్వం నుంచి ×ఖీవీ×ూ ద్వారా ఇవ్వాలి

5 ) ప్రతి కార్మికునికి ఎంప్లాయిస్ షేర్ పూర్తిగా ప్రభుత్వమే చెల్లించాలి

6 ) జుూ× , హెల్త్ కార్డ్స్ ఇవ్వాలి

7 ) జీతాలు ప్రతినెల ఐదో తేదీ లోపల చెల్లించాలి

8 ) మహిళా కార్మికులకు వేతనంతో కూడుకున్న నెలసరి సెలవు. డ ప్రసూతి సెలవులు ఇవ్వాలి

9 ) కార్మికులు డ్యూటీకి వచ్చేటప్పుడు లేదా డ్యూటీ నుండి తిరిగి ఇంటికి వెళ్ళేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగి మరణించినచో ఆ కుటుంబానికి ప్రమాద బీమా కింద 10,00,000/- ఇవ్వాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

10 ) బెడ్ సైడ్ కాంటాక్ట్ విధానాన్ని తీసివేసి తెలంగాణ రాష్ట్రంలో ఐ వీ జు డ ు ఎ ఎూ క్రింద పనిచేస్తున్న శానిటేషన్ , పేషంట్ కేర్ , సెక్యూరిటీ , సూపర్వైజర్లకు ఫిక్స్ వేతనం ఇవ్వాలి.

11 ) అప్గ్రేడ్ అయిన హాస్పిటల్స్ లో సరిపోయే అంత సిబ్బందిని తీసుకొని పని భారం తగ్గించాలి

పై భాగంలో ఉన్న షరతులు పరిష్కరించని ఎడల “” మే 25న “” తెలంగాణ రాష్ట్ర 33 జిల్లాలలో ఉన్న ప్రభుత్వ ఆస్పటల్ శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ సూపర్వైజర్ కార్మికులందరూ “” మహాధర్నా “” హైదరాబాద్ నందు నిర్వహించడం జరుగుతుందని ఈరోజు ఐవీజు ఆఫీస్ నందు లెటర్ ఇవ్వటం జరిగినది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ూ్రూ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు

మాతంగి అనిల్ కుమార్. రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి గొర్రె. నాగరాజు.

హైదరాబాద్ సెంటర్ గాంధీ హాస్పిటల్ ూ్రూ లీడర్. ఆనంద్ ; మురళి; రమణ అక్క ; అనిల్. ; నాగరాజు. తదితరులు పాల్గొన్నారు .

# అరైవ్ -అలైవ్ ఒక ఉద్యమం లా కొనసాగాలి!

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి!
- డి.ఎస్.పి విట్టల్ రెడ్డి



**న్యూస్ ఇండియా ప్రతినిధి యాదగిరి కామారెడ్డి:** పిట్లం మండల కేంద్రంలోని శుక్రవారం రహదారి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, బాన్సువాడ డి.ఎస్.పి విట్టల్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రోడ్డు ప్రమాదాల నివారణను కార్యక్రమంగా కాకుండా, ఒక ఉద్యమంగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి 90 రోజుల కార్యాచరణలో భాగంగా పోలీస్ శాఖ, జాతీయ రహదారి అథారిటీ అధ్వర్యంలో శుక్రవారం నాడు రహదారి భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా,. డి.ఎస్.పి ముఖ్యమైన అంశాల పై అవగాహన కల్పించారూ. రోడ్డు భదర నియమాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. బైకె ప్రయాణించే సమయంలో ఇద్దరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అంతేకాకుండా పైపై ప్రయాణిస్తున్న 4-5 సంవత్సరాల చిన్నారులకు కూడా హెల్మెట్ పెట్టడం చాలా ముఖ్యం అని సూచించారు.

వాహనం నడిపేటప్పుడు డ్రైవర్ కాకుండా పక్కన కూర్చున్న వారు కూడా సీట్ బెల్ట్ ధరించాల్సిన అవసరా న్ని గుర్తుచేశారు. ఇవి ప్రమాదాల సమయంలో ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు... రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తే ఇంటి నుండి బయటకు వెళ్లిన వారు సేప్ గా ఇల్లు చేరుకుంటారని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు “టాఫిక్ రూల్స్ పాటిద్దాం సమాజంలో ప్రమాదాల ను అరికడదాం” అనే సందేశంతో ముందుకెళ్ళాల్సిన అవసరం ఉందని తెలిపారు. అంతకు ముందు మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరుగుతున్న ప్రమాదాలను, హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయడం వల్ల జరిగే అనర్థాలను నాటక రూపంలో అవగాహన కల్పించారు. ప్రదర్శన పలువురిని ఆకర్షించింది. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితుడు బతికి ఉంటే, రక్తస్రావంతో పడి ఉంటే అతనిని ఏ విధంగా కాపాడాలని, సిపిఆర్ ఏ విధంగా చేసి అతనిని రక్షించాలనేది చేసి చూపించారు.

ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. సెల్ అనేది అవసరమైన సందర్భాల్లో మాత్రమే ఉపయోగించాలని, వాహనం నడిపేటప్పుడు దాన్ని ఉపయోగించడం ప్రమాదాలకు దారితీస్తుందని సూచించారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా పాత్రికేయులకు సుమారు 30మందికి హెల్మె ట్లు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కుమ్మరి యాదగిరి, యాదగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో కళాబృందం సభ్యులకు, డీఎస్పీ, సిఐ, ఎస్సై, పోలీస్ సిబ్బందికు శావలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ తిరుపయ్య, నిజాంసాగర్ ఎస్ ఐ, పిట్లం ఎస్ఐ ఆంజనేయులు, సర్పంచ్ చంద్రశేఖర్, ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు రామ్ రెడ్డి, మోహన్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఇమ్రోజ్, నేషనల్ హైవే అధికారులు, పోలీస్ సిబ్బంది, ఆయా పాఠశాల విద్యార్థినిలు విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత వారోత్సవాలలో కళాకారులకు సన్మానం!



**న్యూస్ ఇండియా ప్రతినిధి యాదగిరి కామారెడ్డి**
పిట్లం మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్ లో శుక్రవారం పోలీస్ శాఖ, నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో, తలపెట్టిన రోడ్డు ప్రమాదాల నివారణ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులకు పిట్లం మండల కేంద్రానికి చెందిన యాదగిరి మెడికల్ యజమాన్యం ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా యాదగిరి మెడికల్, హాస్పిటల్ యాదగిరి కళాకారులకు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని టవల్స్ కప్పి ఘనంగా సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో బాన్సువాడ డి.ఎస్.పి విట్టల్ రెడ్డి, బాన్సువాడ సిఐ తిరుపయ్య ఎస్సై ఆంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

# అస్మత్పూర్‌కు ఊపిరి పోసిన బోర్..!

తాగునీటి సమస్యకు సర్పంచ్ శివ మాధవ్ చొరవతో పరిష్కారం..



**రంగారెడ్డి జిల్లా, మంచాల, ఏప్రిల్ 17 న్యూస్ ఇండియా ప్రతినిధి:**మంచాల మండలం అస్మత్పూర్ గ్రామంలో నెలకొన్న తాగునీటి కష్టాలకు చెక్ పడింది. గత కొంతకాలంగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలకు గ్రామ సర్పంచ్ శివ మాధవ్ చొరవతో ఉపశమనం లభించింది. గ్రామంలో పెరుగుతున్న నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ శివ మాధవ్, వార్డు సభ్యులతో కలిసి కొత్తగా బోర్ వేయించారు. దీంతో గ్రామంలో తాగునీటి సరఫరా మెరుగుపడి ప్రజలు కొంతవరకు ఊపిరి పీల్చుకున్నారు. కొత్తగా ఏర్పాటైన బోర్ ద్వారా శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివ మాధవ్ మాట్లాడుతూ, గ్రామంలో ఇకపై నీటి సమస్య పునరావృతం కాకుండా మరిన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధి దిశగా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా సమస్యపై స్పందించిన గ్రామ పాలక వర్గాన్ని స్థానికులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చట్టాల్ని తుంచుతున్న రెవెన్యూ అధికారులు..!



- మొండిగౌరెల్లిలో భూసేకరణ పేరిట కోట్ల స్కామ్..?
- రైతులకు న్యాయం లేకపోతే నిరాహార దీక్షకు హెచ్చరిక..

**రంగారెడ్డి జిల్లా, యాచారం, ఏప్రిల్ 17, న్యూస్ ఇండియా ప్రతినిధి:**యాచారం మండల కేంద్ర పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో భూసేకరణ వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. పారిశ్రామిక పార్క్ పేరుతో ప్రభుత్వ భూముల సేకరణలో రెవెన్యూ అధికారులు చట్టాలను పక్కన పెట్టి వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామ రైతులకు అన్యాయం జరిగితే త్వరలోనే నిరాహార దీక్ష చేపడతామని స్థానిక నాయకులు హెచ్చరిస్తున్నారు. మొండిగౌరెల్లి గ్రామంలో 2013 భూసేకరణ చట్టం అమలే కాలేదని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికే కబ్జాలో ఉన్న భూములకు పరిహారం చెల్లించబోమని అధికారులు చెప్పడం మరింత ఆగ్రహానికి దారితీసింది. 1993, 2005లో నమోదైన రెవెన్యూ రికార్డుల ప్రకారం అసలు రైతుల పరిస్థితి ఏమిటో స్పష్టత ఇవ్వాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో భూసేకరణ మొత్తం ముగ్గురు పెద్దల అండదండలతో జరుగుతోందని, నిజమైన రైతులను పక్కన పెట్టి ఇతరులకు లాభాలు చేకూర్చుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నెంబర్లు 19, 68, 127లో మొత్తం 677.29 ఎకరాల భూమి సేకరణకు గత సంవత్సరం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం భూముల గుర్తింపు, పరిహారం నిర్ణయంలో తీవ్ర గందరగోళం నెలకొంది. రైతులు మెరుగైన పరిహారం కోసం ఆర్డీఓ, కలెక్టర్, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ చివరకు ఎకరాకు రూ.30 లక్షలుగా నిర్ణయించుకున్నప్పటికీ, ఇందులో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు, మధ్యవర్తుల మధ్య కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయన్న గుసగుసలు గ్రామంలో వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూమిగా ఉన్న సర్వే నెంబర్ 19లో 159 ఎకరాలు, 127లో 7 ఎకరాలు అదనంగా నమోదు చేయడం కూడా అనుమానాలకు తావిస్తోంది. అంతేకాకుండా భూమికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు ఆన్లైన్ రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేసుకున్న ఘటనలు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. అసైన్డ్ భూముల విషయంలో వారసులు లేకపోయినా తాము వారసులమంటూ రికార్డులు మార్చడం, అధికారుల అండతో రాజకీయ పలుకుబడిని ఉపయోగించి భూకబ్జాలకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిజమైన భూస్వాములను గుర్తించి వారికి న్యాయం చేయాలని, లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

# జలధార నిధులను సమర్ధ వంతంగా వినియోగించాలి.

జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్.

**అనకాపల్లి** న్యూస్ ఇండియా ప్రతినిధి జిల్లాలో జలధార - నీటి భద్రత కింద చేపడుతున్న పనుల వలన భూ గర్భ నీటి మట్టాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్ ఆదేశించారు . అంతే కాకుండా నీటి వనరుల నిల్వలు పెంచడానికి, నీటిని సంరక్షించడానికి, సాగు నీటి వ్యవస్థ బలోపేతం అవడానికి ప్రణాళికలు తోడ్పడాలన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఇరిగేషన్ సంబంధిత అధికారులతో జలధార - నీటి భద్రత పై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలధార కింద గ్రామాల్లో ప్రాధాన్యత గుర్తించిన చెరువుల పనులకు డీటెయిల్డ్ ఎస్టిమేట్లను తయారు చేసి పంపాలని ఆదేశించారు. ఈ గ్రామాల్లో పనులతో భూగర్భ జల మట్టాలు పెరిగేలా ప్రతిపాదనలు ఉండాలన్నారు. జిల్లాలో భూగర్భ జలాలు మట్టాన్ని పెంపొందించడం, నీటి వనరులు సంరక్షణ, సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అవసరాలను గుర్తించాలన్నారు. అందులో భాగంగా నీటి వనరులను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు, వాగులు, చెరువుల అనుసంధానం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం.. తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు.

సాగునీటి కాలువలు, చెరువులు గట్లను బలోపేతం చేయడం, కాలువల పూడికతీత, లాక్స్ మరమ్మతులు వంటి పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో చెక్ డ్యాములు, ఉంటే గుర్తించి.. క్లియర్ చేసేందుకు ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా పనులను ప్రతిపాదించాలన్నారు. గ్రామ పరిసరాల్లో ఉన్న చెరువులు, కుంటలు, కాలువల అనుసంధానం, కాస్కెట్ ట్యాంక్ లు, అలాగే జిల్లాలో నున్న చెరువులకు పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ పనులన్నీ ఉపాధి హామీ పథకం కింద రిజిస్టర్ కావాలన్నారు. ఉపాధి హామీ నిధులు సమర్ధవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు ఉండాలన్నారు. జిల్లా ప్రణాళికలు, రైతులకు ఉపకరించేలా రూపొందించాలన్నారు. ఎంపీడీవోలు, ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. డూమా పిడి, ఇరిగేషన్ అధికారులు, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలకి తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలి..

సిపిఐ అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్..



**రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్, ఏప్రిల్ 17, న్యూస్ ఇండియా ప్రతినిధి:**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనేది ఈ ప్రాంత ప్రజల ఎన్నో ఏండ్ల కల అలాంటి కల సాకరమైన సందర్బంభాన్ని గురువారం నాడు పార్లమెంట్ లో పాకిస్థాన్ తో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకి వెంటనే క్షమాపణ చెప్పాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి కామ్రేడ్ అజ్మీరా హరిసింగ్ నాయక్ డిమాండ్ చేసారు.తెలంగాణ ప్రజలు తమ ఆత్మ గౌరవం కోసం,తమ ఆస్తిత్వం కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావాలని 60 ఏండ్ల నుండి పోరాటాలు చేసి ఎంతో మంది ప్రాణాలు అర్పిస్తే ఈ రాష్ట్రం ఏర్పాటు అయింది అని అన్నారు.భూమీ,భూక్తి,విముక్తి కోసం సాగిన పోరాటాన్ని త్యాగాల ద్వారా ఏర్పడ్డ రాష్ట్రాన్ని ఉద్దేశించి గతంలో ప్రధాని నరేంద్ర మోడీ సైతం అనుచిత వ్యాఖ్యలు చేశారాని గుర్తు చేశారు.మతోన్మాద పార్టీ అయినా బీజేపీ ప్రతినిధులు తెలంగాణ ప్రాంతం,ప్రజలు,అమరుల త్యాగాలు అన్న ఏ మాత్రం గౌరవం లేదని అనేక సార్లు అవమానించారు అని గుర్తు చేశారు.తెలంగాణను తేజస్వి సూర్య అవమానించిన కూడా తెలంగాణ బీజేపీ ఎంపీలు కనీసం అభ్యంతరం చెప్పకపోవటం సిగ్గు చేటు అని మండిపడ్డారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాటం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతోందని అలాంటి పోరాటాన్ని,పోరాటాల తెలంగాణని ఎవరు అవమానించిన ఊరుకునేది లేదని వెంటనే తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకి మరియు అమరుల కుటుంబాలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

న్యూస్ ఇండియా
నిజం మా ఇజం
# ఎడిటోరియల్

## నిర్లక్ష్యపు నీడలలో శాతవాహనుల తొలి రాజధాని


అవిభక్త కరీంనగర్ జిల్లాకు 50 వేల సంవత్సరాలకు పూర్వపు చరిత్ర ఉంది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనుల మొట్ట మొదటి రాజవంశం, ఆదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతమో అనుకుంటే కాదని, అంతకు ముందే వీరు ఆంధ్రులని, కరీంనగర్ జిల్లా నే వారి మూల పురుషులకు ఆవాస స్థానమని, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేశాయి.శాతవాహన వంశానికి మూలపురుషుడు అని భావింపబడే శ్రీముఖుడు కోటి లింగాలను రాజధానిగా చేసుకుని పాలించాడని స్పష్టం అయినాక, ఆయన నాణేలు కోటిలింగాలలో లభ్యమైనాక చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. జిల్లా కేంద్రమైన కరీంనగర్ కు 65 కి.మీ .ల, ధర్మపురి క్షేత్రానికి 19 కి.మీ.ల దూరాన వెల్గటూర్ మండలం లోని గోదావరి, పెద్దవాగు సంగమ స్థాన మందుగల కోటిలింగాల లోని పుట్ట కోట గోడలు (పూర్వపు కోటలు) ఆంధ్రదేశ పాలకులైన శాతవాహనుల తొలి రాజులకు ఆటపట్టయినవి. ఆంధ్రుల తొలిరాజుగా పురాణాలలో వర్ణించ బడిన శ్రీముఖ చక్రవర్తి నాణాలను , కప్పారావు పేట సమీపాన, ధర్మపురి వాస్తవ్యులు ప్రముఖ చారిత్రక పరిశోధకులు, పురావస్తు శాఖలో ఎపిగ్రాఫిక్ అసిస్టెంట్ (శాసన వ్యాఖ్యాత)గా పనిచేస్తూ మరణించిన సంగనభట్ల నరహరి శర్మ సేకరించి, పురావస్తు శాఖకు అప్పగించడంతో , ఈ ప్రాంత ప్రాశస్త్యం వెలుగు చూడగలిగింది. శాతవాహన కాలానంతర మైనట్టి వారికి ఉద్యోగ చెందిన "మహా తలవర, మహా సేనాధిపతిపతిస" ఆను నాణెములు ఇచ్చట లభించినవి. విదిశా నగరమును కేద్రముగా ఏలిన చివరి శుంగ రాజుల నాణెములు లభింపగా, వాటిపై బ్రాహ్మీ లిపిలో "రజోగోబదస, రజో సమగోపస" అని వ్రాసి ఉన్నవి. శుంగుల అనంతరం మగధను ఏలారని పురాణాలలో పేర్కొనిన కాణ్వ రాజుల నాణెములు కూడా లభించాయి. వీటి ఆధారంగా పురాణములందు పేర్కొన్నట్లు, మగధ రాజ్యమును మౌర్యుల అనంతరం శృంగులు, కాణ్వులు పిదప ఆంధ్రులు వరుసగా పాలించినట్లు తార్కాణం ఇచ్చు చున్నదని పురావస్తు శాఖ మాజీ డైరక్టర్ పుచ్చా వాసుదేవ పరబ్రహ్మ శాస్త్రీ సోదాహరణంగా నిరూపించారు. వీటిలో కొన్ని కోటిలింగాల పొలములలో బ్రాహ్మీ లిపి లోని శిలా ఫలకాలు వెలుగు చూశాయి. ఇచట లభించినట్లు అపు రూప నాణెములు వేరెచ్చటా లభించని కారణంగా , కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని అని, పరిసర ప్రాంత కేంద్ర స్థానమని స్పష్టమైంది. కోటిలింగాలలోనే నరహరిశర్మ పంచమార్క్ నాణేలు , ఇతర అపు రూప నాణేలు సేకరించి పురావస్తు శాఖకు హస గతం చేశారు. వానిలో "రజో శాతవాహ , రజో సాతకంనిస" అని బ్రాహ్మీ లిపిలో వ్రాయ బడింది. లిపి ప్రకారం శ్రీముఖుని కన్నా ఇవి ప్రాచీనమైనవి. సహజంగా ఉండవలసిన ఉజ్జయిని చిహ్నం వీటిలో లేదని నరహరి పరిశోధనలో పేర్కొన్నాడు. శాతవాహన కాలపు పొరల్లో అనేక శాతవాహన నాణేలు లభించాయి. లభ్యమైన నాణెములను బట్టి శాతవాహన వంశ మూల పురుషుడైన శాత వాహనుడు ఆంధ్ర గోపులను , శబరులను, మహా తలవరులను, తదితర ఆంధ్ర రాజులను ఓడించి శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. శాతవాహనులు తొలుత ఆంధ్రుల పాలనలో భాగమై, ఆంధ్ర భృత్యులుగా ఉండి, బలవంతులై సామ్రాజ్య స్థాపనకు పూనుకున్నారని, శ్రీముఖుడు చివరి కాణ్వరాజును అంతమొందించి, స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరచి, విస్తరించారని జగిత్యాలకు చెందిన ప్రముఖ చారిత్రక పరిశోధకులు, రిటైర్ రీడర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య కరీంనగర్ చారిత్రక సంస్కృతి గ్రంథంలోని వివరించారు. హాల చక్రవర్తి గాథా సప్తశతి లోని గోదావరి వర్ణన ఆధారంగా, లభ్యమైనట్లు శ్రీముఖ నాణాలను బట్టి కోటిలింగాల, శాతవాహనుల బలిష్ట దుర్గమని స్పష్టం అవుతున్నది. కోటిలింగాల సమీపమున గల గుట్ట జైన మునులకావాస స్థానముగ నుండేదని తెలుస్తున్నది. సమీపాన క్రీ.పూ.రెండవ శతాబ్దపు బౌద్ధ స్తూపం పాపాయిగాం గుట్టపైన ఉండేది. ప్రస్తుతం మధ్య యుగానికి చెందిన దేవాలయం గ్రామంలో ఉంది. రెండు గర్భగృహాలకు ఉమ్మడి మంటపముంది. ప్రతి గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధానాలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడుగా ప్రతిష్ఠితుడు కాగా, దక్షిణ దిశలో ఉత్తర ముఖ గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధాన ఆలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడై ఉన్నాడు. ఆలయం చాళుక్య రీతులలో నుండి, గోదావరి ఒడ్డున అనేక శిల్ప ప్రతిమ లున్నాయి. పురావస్తు శాఖచే త్రవ్వకాలు జరపబడి, పర్యాటక శాఖ గుర్తింపు పొందింది ఈ ప్రదేశం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాక్చరిత్రకు నిలువెత్తు నిలువుటద్దంగా నిలిచి, శాతవాహనుల తొలి రాజధానిగా చరిత్ర పుటలకెక్కి, జిల్లా సంతరించుకున్న జిల్లా చరిత్ర గతినే మార్చి, విశేష ప్రాధాన్యత కోటిలింగాల ఒడ్డు, గోదావరి నీటి వల్ల నానాటికీ కోతకు గురవు తున్నది. తవ్వకాలు జరిపితే చారిత్రక సత్యాలెన్నో వెలికి తీయగల చరిత్రకు పూర్వపు గ్రామం, ప్రమాదపు టంచున పయనిసున్నది. స్థానికుల, దాతల చేయూత, ధర్మకర్తల మండళ్ళ కృషితో, ప్రత్యేక నిధులను ప్రోగు చేసుకుని దేవస్థానాన్ని అభివృద్ధి పరుచుకుంది. పర్యాటక శాఖ ఈ గ్రామంపై చాలా కాలం చిన్నచూపే చూసింది. గతంలో చాలా సందర్భాలలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రముఖ పర్యాటక స్థలంగా తీర్చిదిద్ద గలమని ఇచ్చిన హామీలు, చేసిన ప్రకటన – నీటి మూటలు గానే మిగిలి పోయాయి. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర సాయి నాయకులు, ఉన్నతాధికారులు , చారిత్రక విషయాసక్తులైన వ్యక్తులు, రాష్ట్ర చరిత్రలో ప్రధాన ప్రదేశమైన కోటిలింగాలలో ప్రత్యేక అభివృద్ధి పనులు, ప్రాచీన చారిత్రక అవశేషాల సంరక్షణా చర్యలను చేపట్టడంపై, నిర్ణయాత్మక కార్యక్రమాలను చేపట్టడంలో ఆలసత్వాన్నే ప్రదర్శించారు. ఈ కారణంగానే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాచీన చరిత్రకు సాక్షీ భూతంగా నిలిచిన కోటిలింగాల నేడు కాలగర్భంలో కలిసి పోయే ప్రమాదంలో ఉంది. శ్రీపాద పాజెక్టు నిర్మాణ చర్యలలో భాగంగా చారిత్రక గ్రామానికి వరద ముప్పు భయభ్రాంతులకు గురి చేస్తున్నది. దీనితో ఈ గ్రామ చరిత్ర పుటల నుంచి కనుమరుగు అయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఈ విషయాన్ని ఆలస్యంగా నైనా గ్రహించిన జిల్లా మేధావి వర్గం, కోటి లింగాలను పరిరక్షించే చర్యలు గైకొనాలని గత ప్రభుత్వానికి విన్నవించింది. రాష్ట్ర రాజధాని నుండి సైతం ఈ అంశంపై అవగాహన కలిగిన దివంగత ప్రభుత్వ సలహాదారు విద్యాసాగర్ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆచార్య జయధీర్ తిరుమల రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజిరెడ్డి, ఐకాస కన్వీనర్ కోదండరాం, తెలంగాణ జాగృతి వ్యవస్తాపకులు కవిత, కవి గాయకులు దేశపతి శ్రీనివాస్, కుర్రా జితేంద్ర బాబు లాంటి మేధావులను రప్పించి, కోటిలింగాల పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించి, తద్వారా గత ప్రభుత్వం దృష్టి ఆకర్షించి, పరిరక్షించే ప్రయత్నం చేసింది. అపురూప నాణేలు లభ్యమైన కోటిలింగాల గ్రామం ఖాళీ అయితే, త్రవ్వకాలకు మరింత సానుకూలత ఉండగలదనే ప్రతిపాదన అందుకున్న రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ చెన్నారెడ్డి అందుకు సానుకూలంగా స్పందించి, కోర్ కమిటీ నిర్ణయాన్ని అనుసరించి తవ్వకాలు జరిపేలా కృషి సల్పగలమని ప్రకటించి నామ మాత్రపు తవ్వకాలు చేపట్టి చేతులెత్తేయడం జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు ముంపుకు గురికాకుండా ఆలంపూర్ లో నిర్మించినట్లు, కోటిలింగాల పరిరక్షణ గోడలు నిర్మించాలనే ప్రతిపాదన చాలా కాలంగా కాగితాలకే పరిమిత మైంది. గతంలో నాటి సంబంధిత మంత్రి పొన్నాల లక్ష్మయ్య వద్ద ప్రతిపాదనలు ఉన్నా, పట్టించు కోలేదు. తెరాస ప్రభుత్వ సంబంధిత గత కార్యదర్శి వెంకటేశం దర్శించి, తగు చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. ఇలా ఉంటే తెరాస ప్రభుత్వంలో ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ చీఫ్ విప్ గా చేరాక, ఆయన చొరవ కృషి, కృత నిశ్చయం ఫలితంగా, పర్యాటక శోభను సంతరింప చేయాలనే తపన కారణంగా, 2018 జనవరి ఆరవ తేదీన నాటి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ ల చేతుల మీదుగా రెండు బోట్లను ప్రారంభించారు. 50 సీట్ల కెపాసిటీతో "శాతకర్ణి", 25 సీట్లు కెపాసిటీ గల "పులోమావి" తో పాటు 4 సీటర్ల స్పీడ్ బోట్ ను ప్రారంభించారు. మంత్రిగా కొప్పుల ఈశ్వర్ హరిత హోటల్ ఏర్పాటు, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు చేపట్టడానికి కృషి చేశారు. మారిన ప్రభుత్వం, ప్రస్తుత రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి, స్థానిక ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేయూతను అందించి, పర్యాటక సంబంధంగా ఎంతో చేయాల్సి ఉంది. రాష్ట్ర చరిత్రతో విడదీయ రాని సహస్రాబ్దుల సంబంధాన్ని కలిగిన అపు రూప చారిత్రక బంధాన్ని తత్సంబంధ ఆధారాలను పరిరక్షించి, గోదావరి వద్ద రక్షణ గోడ నిర్మించి, కోటిలింగాల ఉనికిని కరుమరుగు కాకుండా ఉండ గలందులకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉన్నాయి.

# ఈ పండ్లు తిన్నారంటే రోజంతా ఫుల్ ఖుష్



వేసవిలో చాలా మందికి నిస్సత్తువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. ఈ సమయంలో శరీరాన్ని ఎంత చల్లగా, తాజాగా ఉంచుకోవడానికి చాలా మంది శీతల పానియాలు, కొబ్బరి నీళ్లు వంటివి తీసుకుంటూ ఉంటారు. అయితే ఎండలో చెమట రూపంలో ఒంట్లోని నీరంతా ధారగా కారుతుంది. దీని కారణంగా డీహైడ్రేషన్ సమస్య తలెత్తుతుంది. వేసవిలో మండే ఎండలు త్వరగా శక్తిని కోల్పోయేలా చేస్తాయి. దీంతో నిస్సత్తువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. ఈ సమయంలో శరీరాన్ని ఎంత చల్లగా, తాజాగా ఉంచుకోవడానికి చాలా మంది శీతల పానియాలు, కొబ్బరి నీళ్లు వంటివి తీసుకుంటూ ఉంటారు. అయితే ఎండలో చెమట రూపంలో ఒంట్లోని నీరంతా ధారగా కారుతుంది. దీని కారణంగా డీహైడ్రేషన్ సమస్య తలెత్తుతుంది. వేసవిలో వచ్చే ఈ సమస్య నుంచి బయటపడటానికి అధిక నీటితో పాటు కొన్ని రకాల పండ్లను కూడా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పండ్లను తినడం ద్వారా శరీరంలో తగినంత నీటి శాతాన్ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది. నారింజ పండ్లు నీరు అధిక శాతం ఉండే పండ్లు. వీటిల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. వీటిలోని అధిక నీటి శాతం వేడి వాతావరణంలో శరీరానికి మంచి హైడ్రేషన్‌ను అందిస్తుంది. అంతేకాకుండా వాటిలోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. వేసవిలో డీహైడ్రేషన్‌ను నివారించడానికి, శరీరంలో నీటి శాతాన్ని నిలుపుకోవడానికి పుచ్చకాయలను తినడం మంచి ఎంపిక. ఇందులో 92 శాతం నీరు ఉంటుంది. కాబట్టి ఇది వేసవికి అనువైన పండు. ఇది శరీరానికి తేమను అందించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. స్ట్రాబెర్రీలు తినడానికి రుచికరంగా ఉండటమే కాకుండా వాటిలో మంచి మొత్తంలో నీరు కూడా ఉంటుంది. విటమిన్ సిచ యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల స్ట్రాబెర్రీలు శరీరాన్ని ఫ్రీ రాడికల్ నష్టం నుంచి, వేడి నుంచి కాపాడతాయి. వేసవిలో దొరికే సీజనల్ పండ్లలో పనస ముఖ్యమైనది. ఇది మంచి సువాసనతో పాటు ఎన్నో మేలు చేసే పోషకాలు దండిగా కలిగి ఉంటుంది. తినడానికి ఈ పండు రుచికరంగా ఉండటమే కాకుండా, శరీరానికి తేమను కూడా అందిస్తుంది. అంతేకాకుండా అనాస పండులో మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ముఖ్యమైన పోషకాలు దండిగా ఉంటాయి. కీరదోసలో 96 శాతం నీరు ఉంటుంది. ఇది శరీరానికి మంచి హైడ్రేషన్‌ను అందిస్తుంది. కాబట్టి ఈ వేసవిలో ప్రతిరోజూ కీరదోస సలాడ్, లేదా జ్యూస్ ఎలా తీసుకున్నా మంచిదే.

# ఏ విటమిన్ ఏ వ్యాధి నుంచి రక్షిస్తుంది..?




విటమిన్లు అనేవి శరీరంలోని దాదాపు అన్ని విధులలో కీలక పాత్ర పోషించే ఆవశ్యక పోషకాలు. వాటి లోపం అనేక సమస్యలకు దారితీయవచ్చు. అందువల్ల, ఏ విటమిన్లు ఏ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయో అర్థం చేసుకోవడం ముఖ్యం. విటమిన్లు శరీరానికి అవసరమైన పోషకాలు.. ఇవి మన మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. శరీరానికి శక్తిని అందించడానికి, అవయవాల సరైన పనితీరును నిర్వహించడానికి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. ప్రతి విటమిన్‌కు ఒక ప్రత్యేకమైన పని ఉంటుంది.. ఉదాహరణకు ఎముకలను బలోపేతం చేయడం.. మరికొన్ని చర్మ, కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.శరీరం చాలా విటమిన్లను స్వయంగా ఉత్పత్తి చేసుకోలేదు. కాబట్టి వాటిని ఆహారం ద్వారా పొందడం చాలా అవసరం. ఈ విటమిన్ల లోపం వివిధ ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. తగినంత మోతాదులో విటమిన్లను తీసుకోవడం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా, అనేక వ్యాధులను నివారిస్తుంది.. శరీర పనితీరును మెరుగుపరుస్తుంది. అందువల్ల, సమతుల్య ఆహారంలో విటమిన్లను చేర్చడం చాలా కీలకం. ఏ విటమిన్లు ఏ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి.. ఎముకలు, కండరాల బలానికి విటమిన్ డి, బి12 చాలా అవసరం.. అవి బలాన్ని అందించి, బలహీనత,

ఎముకలకు సంబంధించిన సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. విటమిన్ ఎ, విటమిన్ ఇ దృష్టి, చర్మ ఆరోగ్యాన్ని

కాపాడటానికి సహాయపడతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలోనూ, కళ్ళను రక్షించడంలోనూ ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. గుండె, మెదడు సరిగ్గా పనిచేయడానికి విటమిన్ బి6, బి12 చాలా అవసరం. అవి రక్త ప్రసరణను మెరుగుపరిచి, మానసిక ఆరోగ్యానికి తోడ్పడతాయి. విటమిన్ లోపాలను గుర్తించడానికి నిర్దిష్ట రక్త పరీక్షలు నిర్వహిస్తారు. వీటిలో విటమిన్ డి, విటమిన్ బి12, ఐరన్ ప్రొఫైల్, కాల్షియం పరీక్షలు ఉంటాయి. మీ లక్షణాల ఆధారంగా వైద్యులు తగిన పరీక్షలను సిఫార్సు చేస్తారు. ఒక వ్యక్తికి తరచుగా అలసట, నీరసం, జుట్టు రాలడం లేదా చర్మ సమస్యలు వంటివి కనిపిస్తే, అది విటమిన్ లోపానికి సంకేతం కావచ్చు. క్రమం తప్పని వైద్య పరీక్షలు ఈ పరిస్థితిని నిర్ధారించి, తగిన చికిత్సను ప్రారంభించడానికి సహాయపడతాయి.

# బూడిద గుమ్మడి కాయ జ్యూస్ తాగుతున్నారా?

ఈ మధ్యకాలంలో బూడిద గుమ్మడికాయ జ్యూస్ ట్రెండింగ్‌లో ఉంది. చాలామంది ఉదయాన్నే పడిగడుపున దీనిని తాగుతున్నారు. అయితే.. బూడిద గుమ్మడి జ్యూస్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పచ్చి కూరగాయల జ్యూస్‌లలో ఉండే ఆక్సిలేట్‌లు ఈ సమస్యకు కారణం కావచ్చు. యాంటీ–న్యూట్రియంట్‌లను తగ్గించడానికి ఉడకబెట్టి తాగడం ఉత్తమం. బూడిద గుమ్మడికాయ జ్యూస్ ఈ మధ్యకాలంలో చాలా ట్రెండీగా మారింది. ఆరోగ్యం కోసం చాలామంది దీన్ని ఉదయాన్నే పడిగడుపున తాగుతున్నారు. అయితే, దీని వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలు, సురక్షితమైన వినియోగం గురించి అవగాహన ఉండటం చాలా ముఖ్యమంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. అన్ని కూరగాయలలో యాంటీ–న్యూట్రియంట్స్ ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.. ఇవి శరీరంలో విటమిన్ శోషణ, జీర్ణక్రియను ప్రభావితం చేయవచ్చు. బూడిద గుమ్మడికాయలో ఆక్సిలేట్స్ అనే యాంటీ–న్యూట్రియంట్ అధికంగా ఉంటుంది. సుమారు 300–400 గ్రాముల బూడిద గుమ్మడికాయ ముక్కల నుండి తీసిన 200–300 ఎశ్రీ పచ్చి జ్యూస్‌లో ఆక్సిలేట్ల సాంద్రత చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ అధిక ఆక్సిలేట్ కంటెంట్ మనం ఆహారం ద్వారా తీసుకునే కాల్షియంతో కలిసి కిడ్నీలో



రాళ్లు ఏర్పడే అవకాశాన్ని పెంచుతుందని పేర్కొంటున్నారు. ఇది అందరికీ రాకపోయినా, కొంతమందిలో ఆరోగ్య సమస్యలను సృష్టించగలదు. అందుకే, పడిగడుపున పచ్చి జ్యూస్ తాగడం అనేది అందరికీ సరైనది కాదని హెచ్చరిస్తున్నారు.

ఆక్సిలేట్ కంటెంట్‌ను తగ్గించడానికి బూడిద గుమ్మడికాయను ఉడకబెట్టి లేదా కొద్దిగా వేగించి జ్యూస్ చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. ఇలా చేయడం వల్ల దానిలోని యాంటీ–న్యూట్రియంట్ ప్రొఫైల్ తగ్గి, విటమిన్లు ? ఖనిజాలు శరీరానికి మంచిగా అందుతాయి. పచ్చి కూరగాయల జ్యూస్‌లు దీర్ఘకాలంలో చెడు ప్రభావాలు చూపవచ్చని పేర్కొంటున్నారు.. శరీరాన్ని డిటాక్స్ చేస్తుందని చెప్పి అనేక రకాల జ్యూస్‌లను ప్రచారం చేస్తున్నారు. అయితే, కిడ్నీలు, లివర్, లింఫాటిక్ సిస్టం, చర్మం వంటి మన శరీర అవయవాలు సహజంగానే శరీరాన్ని డిటాక్స్ చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. డిటాక్స్ జ్యూస్‌లు అనేది ఒక స్కామ్ అని, శరీరానికి నిజంగా ఏదైనా సమస్య ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలని, జ్యూస్‌లు తాగడం వల్ల లాభం లేదని సూచిస్తున్నారు. సరైన జీవనశైలి, అంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం ద్వారా శరీరం దాని డిటాక్సిఫికేషన్ ప్రక్రియను సమర్థవంతంగా చూసుకుంటుందని గుర్తుచేస్తున్నారు. చాలా మంది జ్యూస్ తాగిన వెంటనే చురుకుగా ఉన్నట్లు భావిస్తారని, అది కేవలం శరీరానికి లభించే విటమిన్లు ? ఖనిజాల తాత్కాలిక ప్రభావం మాత్రమేనని పేర్కొంటున్నారు.

# పేపర్ కప్‌లు వాడటం ఆరోగ్యానికి మంచిదనుకుంటున్నారా?

నేటి ఆధునిక జీవనశైలిలో కాఫీ, టీ తాగే అలవాట్లు కూడా మారిపోయాయి. ప్రయాణాల్లో ఉన్నప్పుడు లేదా ఆఫీసు పనుల మధ్యలో చాలామంది పేపర్ గ్లాసులను వాడటం ఒక ఫ్యాషన్‌గా, సౌకర్యంగా భావిస్తున్నారు. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఒక 'సైలెంట్ కిల్లర్'లా మారుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం చూసే పేపర్ కప్పులు కేవలం కాగితంతోనే తయారవ్వవు. అవి తడవకుండా ఉండటానికి వాటి లోపలి భాగంలో ఒక సన్నని ప్లాస్టిక్ పొరను ఉపయోగిస్తారు. వేడి వేడి టీ లేదా కాఫీ ఆ కప్పులో పోసినప్పుడు, ఆ వేడికి ప్లాస్టిక్ కరిగి ప్రమాదకరమైన రసాయనాలు పానీయంలో కలిసిపోతాయి. కాగితం కప్పులలో ఉండే అత్యంత సన్నని ప్లాస్టిక్ పొరను మైక్రోప్లాస్టిక్స్ అంటారు. వేడి కాఫీ లేదా టీతో ఈ ప్లాస్టిక్ పొరలోని రసాయనాలు కలిసిపోయి నేరుగా మన జీర్ణవ్యవస్థలోకి చేరుతాయి. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం ఇవి రక్తంలోని హార్మోన్ల వ్యవస్థను దెబ్బతీసి రక్తప్రసరణకు ఆటంకంగా మారుతాయి. దీనివల్ల కీళ్ల నొప్పులు, జీర్ణకోశ వ్యాధులు, చివరికి క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. ఈ రసాయనాల ప్రభావం వెంటనే కనిపించకపోయినా, శరీరంలో పేరుకుపోవడం వల్ల దీర్ఘకాలంలో కోలుకోలేని ఆరోగ్య సమస్యలు తప్పవని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. కేవలం పేపర్ కప్పులే కాదు, కర్రీ పాయింట్స్ నుండి వేడి కూరలను ప్లాస్టిక్ కవర్లలో పార్సిల్ తీసుకెళ్లడం కూడా అంతే ప్రమాదకరం. వేడి పదార్థాలు ప్లాస్టిక్ కవర్లతో స్పర్శించినప్పుడు ప్లాస్టిక్‌లోని హానికర కారకాలు ఆహారంలో కలిసిపోతాయి. ఇవి శరీరంలో చేరి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 10 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది కేవలం మానవ ఆరోగ్యానికే కాదు, భూమిపై ఉండే పర్యావరణానికి కూడా పెను సవాలుగా మారింది. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపోవడానికి వందల ఏళ్లు పడుతుంది, ఇది భవిష్యత్తు తరాలకు తీరని నష్టం కలిగిస్తుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించకపోతే భవిష్యత్తులో పెను ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. వీలైనంత వరకు గాజు, స్టీల్ లేదా సిరామిక్ కప్పులను వాడటం ఆరోగ్యానికి మరియు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుంది. బయటకు వెళ్లే సమయంలో మీ సొంత రీయూజబుల్ కప్పును వెంట తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలి. కాఫీ షాపుల్లో లేదా టీ స్టాళ్లలో పేపర్ కప్పులను నిరాకరించి, పర్యావరణ హితమైన మట్టి పాత్రలు లేదా స్టీల్ గ్లాసులను ఎంచుకోవడం ఉత్తమం. చిన్నపాటి మార్పులే మన ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా ఈ భూమిని పదిలంగా ఉంచుతాయి. పేపర్ కప్పులు, ప్లాస్టిక్ ప్లేట్లను ఎంత త్వరగా మానుకుంటే అంత మంచిది. నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది.

# బ్లూ జీన్స్‌లో ఈషా గ్లామర్ టచ్.. నెట్టింట ట్రెండ్





తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వరంగల్ చిన్నది ఈషా రెబ్బా, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలతో నెటిజన్ల మనసు దోచుకుంటోంది. బ్లూ అండ్ బ్లూ జీన్స్ లుక్‌లో ఆమె కనిపిస్తున్న తీరు ఎంతో స్టైలిష్‌గా, అదే సమయంలో చాలా సింపుల్‌గా ఉంది. కస్సుమనే చూపులతో, డిఫరెంట్ స్టిల్స్‌లో ఈషా పంచుకున్న ఈ ఫోటోలు ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతూ ట్రెండింగ్‌లో నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లోనే కాకుండా, ఇలాంటి వెస్ట్రన్ వేర్‌లో కూడా ఆమె గ్లామర్ అదిరిపోయిందని ఫ్యాన్స్ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

**డెనిమ్ లుక్‌లో ఈషా మెరుపులు:**

తాజా ఫోటో షూట్‌లో ఈషా రెబ్బా పూర్తి డెనిమ్ లుక్‌లో దర్శనమిచ్చింది. బ్లూ కలర్ జీన్స్ షర్ట్, దానికి తగ్గట్టుగా జీన్స్ ప్యాంటు ధరించి ఒక నేచురల్ లుక్‌ను సొంతం చేసుకుంది. ఫోటోలో ఆమె కింద కూర్చుని, ఒక చేత్తో ఎల్లో కలర్ 'మినియన్' మగ్‌ను పట్టుకుని, మరో చేతిని తలకు ఆనించి సీరియస్ లుక్ ఇస్తున్న తీరు చాలా ఆకర్షణీయంగా ఉంది. ఇక ఎలాంటి ఆడంబరాలు లేకుండా చాలా సింపుల్‌గా కనిపిస్తూనే, తన కళ్ళతో నెటిజన్లను మెస్మరైజ్ చేస్తోంది. ఈ 'డబుల్ డెనిమ్' ట్రెండ్ ఈషాకు పర్ఫెక్ట్‌గా సెట్ అయిందని చెప్పవచ్చు.

**తెలుగమ్మాయి ప్రయాణం.. సినిమాల సందడి:**

ఇక లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సినిమాతో కెరీర్ మొదలుపెట్టిన ఈషా, అంతకు ముందు ఆ తర్వాత చిత్రంతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగమ్మాయి కావడంతో మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా, తన నటనతో ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చింది. అమీ తుమీ, బందిపోటు వంటి సినిమాల్లో తన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకుంది. ఇక నాని నిర్మించిన అ సినిమాతో పాటు, ఎన్టీఆర్-త్రివిక్రమ్ కాంబోలో వచ్చిన 'అరవింద సమేత'లో ఒక కీలక పాత్రలో నటించి స్టార్ హీరోల సినిమాల్లోనూ తన సత్తా చాటింది. ప్రస్తుతం ఆమె బాలీవుడ్ ఎంట్రీకి కూడా సిద్ధమవుతోంది.

**సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్:**

ఈషా రెబ్బా సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. షూటింగ్ విశేషాలతో పాటు తన వ్యక్తిగత ఫోటోలను కూడా ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌తో పంచుకుంటుంది. హీరోయిన్‌గానే కాకుండా, సెకండ్ హీరోయిన్‌గా కూడా వైవిధ్యమైన పాత్రలు చేస్తూ విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ఇక రీసెంట్ గా 'మామా మశ్చీంద్ర', 'ఓం శాంతి శాంతి శాంతిః' వంటి మూవీ లతో అలరించిన ఈ భామ, కేవలం తెలుగుకే పరిమితం కాకుండా తమిళ్, మలయాళ భాషల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. అందుకే ఆమెకు దక్షిణాది అంతటా ఫాలోయింగ్ పెరుగుతోంది.

**స్టార్ ఇమేజ్ దిశగా అడుగులు:**

ప్రస్తుతం ఈషా రెబ్బా పంచుకున్న ఈ బ్లూ జీన్స్ పిక్స్ ఆమె గ్లామర్ రేంజ్‌ను మరోసారి చాటిచెప్పాయి. ఫోటోలో ఆమె కూర్చున్న భంగిమ, ఆ ఎల్లో మగ్ కాంబినేషన్ నెటిజన్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. చిన్న సినిమాల నుంచి మొదలై ఈరోజు పాన్ ఇండియా స్థాయికి ఎదిగేందుకు ఈషా చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. గ్లామర్ ప్లస్ టాలెంట్ ఉన్న ఈ వరంగల్ బ్యూటీ, త్వరలోనే బాలీవుడ్ లోనూ జెండా పాతాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈషా ఇలాంటి మరిన్ని విభిన్నమైన ఫోటోషూట్‌లతో అభిమానులను అలరించాలని ఆశిద్దాం.





## త్రిష కృష్ణన్ 100 కోట్ల సామ్రాజ్యం: 25 ఏళ్ల సినీ ప్రస్థానంలో అరుదైన మైలురాయి!

దక్షిణాది సినీ పరిశ్రమలో -ఎవర్ గ్రీన్ క్వీన్-గా వెలుగొందుతున్న త్రిష కృష్ణన్ తన 25 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో కేవలం నటిగానే కాకుండా ఒక బ్రాండ్‌గా ఎదిగారు. ప్రస్తుతం త్రిష నికర ఆస్తి విలువ సుమారు 100 కోట్ల రూపాయలకు చేరుకోవడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 1999లో -జోడి- చిత్రంతో సహాయ నటిగా ప్రయాణం మొదలుపెట్టిన త్రిష.. నేటికీ అగ్ర కథానాయికగా కొనసాగుతూ తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. ఒక నటిగా ఇన్ని దశాబ్దాల పాటు తన క్రేజ్‌ను కాపాడుకుంటూ ఆర్థికంగా ఇంతటి ఉన్నత స్థితికి చేరుకోవడం ఆమె పట్టుదలకు నిదర్శనం. త్రిష ఆదాయ వనరులను పరిశీలిస్తే.. ఒక్కో సినిమాకు సుమారు 3 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. -పొన్నియిన్ సెల్వన్- వంటి భారీ విజయాల తర్వాత డిమాండ్ మరింత పెరిగింది. సినిమాలతో పాటు కార్పొరేట్ సంస్థల ప్రకటనల ద్వారా కూడా ఆమె భారీగానే ఆర్జిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాలకు పైగా టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. స్థిరమైన ఆదాయాన్ని గడించారు. ఈ సంపాదనను తెలివిగా వివిధ రంగాల్లో పెట్టుబడిగా మలిచారు. త్రిష ఆస్తిపాస్తుల్లో ప్రధానమైనవి హైదరాబాద్ - చెన్నైలలోని విలాసవంతమైన నివాసాలు. ముఖ్యంగా చెన్నైలోని ఆమె సొంత ఇల్లు అత్యంత ఖరీదైన ఇంటీరియర్స్‌తో సకల సౌకర్యాలతో కూడి ఉంది. దీని విలువ దాదాపు 10 కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా. ఇవే కాకుండా.. రియల్ ఎస్టేట్ రంగంలో కూడా భారీగా పెట్టుబడులు ఉన్నాయి. పలు నగరాల్లో విలువైన భూములు - వాణిజ్య సముదాయాల్లో భాగస్వామ్యం ఉండటం త్రిష ఆర్థిక భవిష్యత్తుకు మరింత భరోసాగా నిలిచాయి. విలాసవంతమైన జీవనశైలికి మారుపేరైన త్రిషకు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. గ్యారేజీలో బిఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, రేంజ్ రోవర్ వంటి ఖరీదైన కార్లు ఉన్నాయి. కేవలం భౌతిక సంపాదనే కాకుండా..జంతు సంరక్షణ .. పలు సేవా కార్యక్రమాల కోసం తన సంపాదనలో కొంత భాగాన్ని వెచ్చిస్తూ సమాజం విషయంలో తన బాధ్యతను చాటుకుంటున్నారు. త్రిష లైఫ్ స్టైల్ నేటి తరం యువ నటీమణులకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తోంది. వృత్తిపరమైన ఒడిదుడుకులు ఎదురైనా.. వ్యక్తిగత జీవితంలో ఎన్ని విమర్శలు వచ్చినా కుంగిపోకుండా తన కెరీర్‌ను విజయవంతంగా మలుచుకున్న త్రిష ప్రయాణం స్ఫూర్తిదాయకం. 40 ఏళ్ల వయసులోనూ కుర్ర హీరోయిన్లకు పోటీనిస్తూ..మరోవైపు వంద కోట్ల ఆస్తిని కూడబెట్టడం చూస్తుటే.. త్రిష వృత్తి గతంగా చూపే అంకితభావానికి ప్రతిఫలం.

Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com